## క్లుప్తంగా

### ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో కోరమాండల్ మత్స్యకార సామాజిక భవనంలో ఆదివారం ఏఎల్ఐ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ, శ్రీసూర్య కంటి ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి కంటి వైద్య సేవలను అందించారు. ఏఎల్ఐ సంస్థ సీఈఓ రాంప్రకాష్ పర్యవేక్షణలో వైద్య శిబిరం కొనసాగింది. అతిథులుగా హాజరైన కోరమాండల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జగన్నాథం, జీఎం పద్మనాభం, సీఎస్సార్ హెడ్ వంశీ, మూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్స చేయిస్తామని రాంప్రకాష్ తెలిపారు. ఎక్కువ మంది మత్స్యకారులు కంటి పరీక్షలు చేయించుకున్నట్టు చెప్పారు.

### గుండె వ్యాధుల ఉచిత శిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

కాకినాడ రూరల్: కోరమాండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ సంస్థ, సిద్దిపేట సత్యసాయి ట్రస్ట్, ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీస్ ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో ఆదివారం వాకలపూడిలోని కోరమాండల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుండె వ్యాధుల నిర్ధారణ ఉచిత శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని డీఎంహెచ్ఓ జె.నరసింహ నాయక్ ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 105 మంది చిన్నారులు, 280 మంది పెద్దలు గుండె పరీక్షలు చేయించుకున్నారు. గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు 34 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి వచ్చే నెలలో సిద్దిపేటలోని సత్యసాయి ట్రస్ట్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని కోరమాండల్ ప్రతినిధులు తెలిపారు.

### విద్యార్థినుల చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణారెడ్డి, భువనేశ్వరి దంపతులు

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన ఇద్దరు పిల్లల చదువుకు నగరానికి చెందిన శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. కాకినాడ రూరల్ మండలం చిత్రాడ గ్రామానికి చెందిన హరిణి, గీతిక తండ్రి గత నెల గుండెపోటుతో మరణించారు. వీరిలో హరిణి జీఎన్ఎం, గీతిక డీఎడ్ స్పెషల్ టీచర్ కోర్స్ చదువుతున్నారు. ఆదివారం నగరానికి చెందిన అనిల్ కృష్ణారెడ్డి తన భార్య డాక్టర్ భువనేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా ఇద్దరు పేద విద్యార్థుల చదువు కోసం సాయం అందించారు. చెరో రూ.20 వేల చొప్పున రూ.40 వేలను స్థానిక శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ సమక్షంలో అందజేశారు.

### పెద్దిరాజుకు జాతీయ స్ఫూర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు పెద్దిరాజు

కాకినాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అధ్యాపకుడిగా పని చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కెరీర్‌కు కృషి చేస్తున్న కాకినాడకు చెందిన నేలపూడి పెద్దిరాజు మదర్ థెరిస్సా స్ఫూర్తి అవార్డు అందుకున్నారు. రావులపాలేనికి చెందిన మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదివారం ఈ అవార్డు అందజేసింది. తన సేవలను గుర్తించి, అవార్డు అందించినందుకు పెద్దిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## కాకినాడ సినిమాలు

| | |
|---|---|
| ఆనంద్ సినిమాస్ | : పరదా, కూలీ, సు ఫ్రం సో, జూనియర్, బన్ బటర్ జామ్ |
| దేవీ మల్టీప్లెక్స్ | : పరదా, వార్–2, కూలీ |
| లక్ష్మి | : కూలీ |
| సత్యగౌరి | : వార్–2 |
| తిరుమల | : బన్ బటర్ జామ్ |
| సీఅండ్‌సీ | : వార్–2 |
| సీఅండ్‌సీ–2 | : కూలీ |
| శ్రీప్రియ | : మహావతార్ నరసింహ |
| పద్మప్రియ | : వార్–2 |

# తలరాత మారేలా..!

- నిరుపేద విద్యార్థులకు వరంగా ప్రజా విద్యాలయం
- ఎందరో అభ్యాగులకు ఉచిత విద్య
- ఇటీవల పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత
- ఇక్కడ చదివి జీవితంలో స్థిరపడిన వారెందరో..
- వివిధ హోదాల్లో ఉద్యోగాల సాధన

బోట్‌క్లబ్: చదువు పేదరికానికి అడ్డు రాకూడదని పాతికేళ్ల క్రితం కాకినాడలో ప్రజా విద్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇక్కడ ఉచిత విద్య అందిస్తున్నారు. పాతికేళ్లుగా ఇక్కడ సుమారు 900 మందికి పైగా విద్యార్థులు ఉచిత విద్యను అభ్యసించి.. వివిధ హోదాల్లో ఉద్యోగాలు సైతం సాధించారు. నిరుపేదలతో పాటు, తల్లిదండ్రుల్లేని వారికి ఈ ప్రజా విద్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

**సుదీర్ఘ చరిత్ర**

బృహత్తర ఆలోచనతో 2000లో కంభంపాటి సుశీల ఈ పాఠశాలను స్థాపించారు. గత ఒకటిన్నర దశాబ్దాలుగా వక్కలంక రామకృష్ణ ఈ ప్రజా విద్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. తొలినాళ్లలో 20 నుంచి 30 మంది మాత్రమే విద్యార్థులు ఉండేవారు. రోడ్డు పక్కన అల్లరిగా తిరిగే చిన్నారులను పాఠశాలకు వస్తే నెలకు రూ.200 వంతున విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చేవారు. అనేక మంది భిక్షాటన చేసే చిన్నారులకు సైతం ఇక్కడ విద్యాబుద్ధులు అందించారు. ప్రస్తుతం సుమారు 150 మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

**కులమతాలకు అతీతంగా..**

**ఇక్కడ కుల మతాలకతీతంగా అందరికీ ఉచిత విద్య వసతి కూడా కల్పిస్తున్నారు. భోజనంతో పాటు, యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందిస్తున్నారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాలు ఈ ప్రజా విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్నారు.** దాతల సహకారంతో ఇక్కడ ఉపాధ్యాయులను నియమించి, వారికి ఎంతో ఉత్తమ విద్య అందిస్తున్నారు. కాకినాడ మధురానగర్‌లో ఈ ప్రజా విద్యాలయం ఉంది. కేవలం చుట్టుపక్కల విద్యార్థులు మాత్రమే కాకుండా, అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను కూడా ఇక్కడ అక్కున చేర్చుకుని, వారి సొంత పిల్లల్లా చదువుతో పాటు, వారికి ఇష్టమైన రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు. సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేసే విధంగా అన్ని పండగలనూ ఇక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహిస్తున్నారు. సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రితో పాటు, జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో కీర్తి చేకూరి, రామారావు ఇక్కడ అందిస్తున్న విద్యా సేవకు నిర్వాహకులను అభినందించారు. వారి సహాయ సహకారాలూ అందించారు.

**ఉత్తమ శిక్షణ**

**ఇక్కడ ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు నిర్వాహకులు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల వారీగా నిష్ణాతులైన వారికి ఎక్కువ** జీతాలు సైతం ఇచ్చి పాఠాలు బోధిస్తున్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులు ఆయా రంగాల్లో ఎంతగానో రాణిస్తున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించడం ఇక్కడి విద్యా ప్రమాణాలకు నిదర్శనం. పరీక్షకు హాజరైన 15 మంది విద్యార్థులూ ఉత్తీర్ణులయ్యారు.

**ప్రత్యేక శ్రద్ధ**

ఉపాధ్యాయులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఇక్కడి విద్యార్థులు చదువులో ఉత్తమంగా రాణిస్తున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి ఉత్తమ విద్య అందిస్తున్నారు. దీంతో వారు పదో తరగతిలో ఉత్తీర్ణులయ్యాక ఉన్నత విద్యను సైతం అభ్యసిస్తున్నారు.

**ఆర్థిక తోడ్పాటు**

ప్రజా విద్యాలయంలో పదోతరగతి వరకు చదువుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రజా విద్యాలయం అండగా నిలుస్తోంది. ఉన్నత విద్యకు అవసరమైన నగదు పురస్కారాలు, ల్యాప్‌టాప్‌లు వంటివి సమకూరుస్తోంది. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించి, అనేక ఉద్యోగాలు సాధించారు. ఇక్కడ పదో తరగతి చదివి, ఉన్నత చదువుల అనంతరం సుమారు 200 మంది వివిధ ఉద్యోగాలు పొందారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు కృషి**

ఆడపిల్లలకు చదువు చెప్పించలేక చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్న విషయం తెలుసుకుని ప్రజా విద్యాలయం కార్యవర్గ సభ్యులు సుమారు వంద బాల్య వివాహాలు నిరోధించారు. ఆడ పిల్లలకు ఇక్కడ చదువు చెప్పి, ఉన్నత చదువులు చదువుకునే విధంగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జీవితంలో వారు నిలదొక్కుకునే విధంగా వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చారు.



ప్రజా విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులు



ప్రజా విద్యాలయం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు



ప్రజా విద్యాలయాన్ని సందర్శించిన సిరివెన్నెల సీతారామశాస్త్రి (ఫైల్)

**ఇక్కడే చదువుకుని..**



ఇదే ప్రజా విద్యాలయం చదువుకుని , బీఈడీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఇక్కడే ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. నేను చదువుకున్న ఈ పాఠశాలలోనే విద్యార్థులకు పాఠాలు చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. ఇక్కడ చదువుకోవడం నా పూర్వజన్మ సుకృతం. ప్రజా విద్యాలయం నన్ను సొంత బిడ్డలా చేసుకుని చదువు చెప్పింది

– సాయి లక్ష్మి, టీచర్

**దాతల సహకారంతో..**



ఇక్కడ నిరుపేద విద్యార్థులకు చదువు, వసతి, భోజనం అన్నీ ఉచితంగా అందిస్తున్నాం. ఇవన్నీ కూడా కేవలం దాతల సహకారంతోనే చేస్తున్నాం. దాతలు మరింత సహకారం అందిస్తే మరెందరో విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తాం. ఎంతో మంది విద్యార్థులు నేడు ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడడం ఎంతో సంతోషంగా ఉంది.

– వక్కలంక రామకృష్ణ, నిర్వాహకులు, ప్రజా విద్యాలయం

## గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రతినిధులు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో 15 ఏళ్ల లోపు పిల్లలకు నిర్వహించిన గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఐవీ రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత జూనియర్స్ విభాగంలో ఐదు నుంచి పదో సంవత్సరం వరకు, సీనియర్స్ విభాగంలో 11 నుంచి 15 ఏళ్ల లోపు ఉంటుందని చెప్పారు. సుమారు 30 పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ భారతీయ ఇతిహాస పురాణాలకు చెందిన విషయాలు నేటితరానికి పరిచయం చేయడం ద్వారా వాటి గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందులో భాగమే పండగల విశిష్టతను చిన్నతనం నుంచే పిల్లలకు పరిచయం చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయ నిర్ణేతలుగా సీఎస్ సత్యనారాయణ, ఆకొండి సూర్యనారాయణ, వాసుదేవరావు, జానకీరామ్ చౌదరి వ్యవహరించారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం భమిడిపాటి లాస్య, ద్వితీయ జుత్తుక అన్నపూర్ణాదేవి, తృతీయ స్థానం కౌశిక్ పొందారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ జి.కృష్ణ సంహిత, ద్వితీయ లాస్య, తృతీయ బహుమతి వేదిత కైవసం చేసుకున్నారు. ఆయా విభాగాలకు 20 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వినాయక వ్రత కల్ప పుస్తకం, వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు ఇంద్రగంటి శ్రీనివాస్, అయ్యగారి వెంకటేష్, మండలీక శాస్త్రి, సీతారామశాస్త్రి, రంగాభట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెద్దాయన జ్ఞాపకాలు మరువలేం

- కురసాల సత్యనారాయణకు నేతల ఘన నివాళి
- వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు కిట్టు ఆధ్వర్యంలో సంతాప సభ



సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ కిట్టు, ఇతర నాయకులు

కాకినాడ రూరల్: అందరితో ఆత్మీయంగా ఉండే పెద్దాయన కురసాల సత్యనారాయణ లేని లోటు తీర్చలేనిదని, ఆయనతో జ్ఞాపకాలు, అనుబంధాలు మరువలేమని పలువురు వక్తలు శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన సంగతి విదితమే. వైఎస్సార్ సీపీ రూరల్ మండల కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ(కిట్టు) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక బోట్‌క్లబ్ ఎదురుగా కృషి భవన్‌లో కురసాల సత్యనారాయణ సంతాప సభ జరిగింది. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాకినాడ సిటీ, కరప మండలాలకు చెందిన పలువురు నేతలు సంతాప సభకు హాజరయారు. బాబాయ్ గారు అంటూ ఆప్యాయంగా పిలుచుకునే సీనియర్ నేత సత్యనారాయణతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. తొలుత జెడ్పీటీసీ కిట్టు ఆధ్వర్యంలో సత్యనారాయణ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ, బాబాయ్ సత్యనారాయణతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. మంత్రిగా కన్నబాబు బిజీగా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి, సాధకబాధకాలు తెలుసుకోవడంతో పాటు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసేవారన్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ, కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సత్యనారాయణ చేసిన సేవలు మరవలేమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద దిక్కును కోల్పోయారన్నారు. ఈ బాధాకరమైన సమయంలో ఆయన కుమారులు కన్నబాబు, కల్యాణ్‌కృష్ణకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజుబాబు, మైనార్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరీం బాషా, సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, బెజవాడ సత్యనారాయణ, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి గణేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడు పెదపాటి నాగబాబు, సీనియర్ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, పుల్ల చందు, కోటేశ్వరరావు, గంజా సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు వడ్డి మణికుమార్, ఐ.శ్రీను, నాయకులు జంగా గగారిన్, గొల్లపల్లి జగన్, ధర్మారావు, వల్లీ, కడియాల చిన్నా, మోకా కృష్ణంరాజు, నల్ల రాణి, భువన, భవాని, ప్రసన్న, అమ్మాజీ, కర్రి చక్రధర్, సిద్దా శివాజీ, పెదపూడి సతీష్, ప్రకాష్, విష్ణు, రెడ్డి నాయుడు, అనుసూరి ప్రభాకర్, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో సర్కారు కొలువుకు..


**డీఎస్సీలో 16వ ర్యాంకు సాధించిన కరప యువతి**



జిల్లా శ్వేత

కరప: ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, పట్టుదలతో కష్టపడి చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించింది కరప గ్రామానికి చెందిన జిల్లా శ్వేత. తండ్రి సంపాదన అంతగా లేకపోయినా, తల్లి టైలరింగ్‌తో పాటు, ఆశా వర్కర్‌గా పనిచేస్తూ పడుతున్న ఆర్థిక ఇబ్బందులు.. ఆమెను జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలన్న ధృడసంకల్పం రేకెత్తించింది. ఆమె ఇంటి వద్దే చదువుకుంటూ డిగ్రీ పూర్తి చేసి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని నిర్ణయించుకుంది. రెండేళ్ల కఠోర శ్రమతో డీఎస్సీకి ప్రిపేర్ అయి, లక్ష్యాన్ని చేరుకుని, డీఎస్సీలో 16వ ర్యాంక్ సాధించింది కరప గ్రామంలోని నక్కావారి ఎస్సీ వీధికి చెందిన శ్వేత. ఆమె తండ్రి జిల్లా మాధవరావు వ్యవసాయ కూలీ, తల్లి రత్నకుమారి కరప పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారిని చదివించలేక పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గోపాలపురం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేర్పించారు. నాలుగు నుంచి పదో తరగతి వరకు అక్కడే చదివారు. పెద్దమ్మాయి బీటెక్ ఇంజినీరింగ్ చదివి ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. రెండో అమ్మాయి శ్వేత పదో తరగతిలో 9.5 గ్రేడ్‌తో పాసైంది. రిలయన్స్ ఇండస్ట్రీ ప్రోత్సాహం పథకం ద్వారా కాకినాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి వద్ద ఉంటూ డిస్టెన్స్‌లో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత కోచింగ్ తీసుకోకుండానే ఇంట్లో రెండేళ్ల పాటు డీఎస్సీకి ప్రిపేర్ అయింది. శుక్రవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఆమె 16వ ర్యాంక్ సాధించింది.

### శ్రీపాద శ్రీవల్లభస్వామికి పుష్ప పూజ



పిఠాపురం: పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి సహస్ర లిల్లీ పుష్ప పూజ జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్ సౌజన్య తెలిపారు. మహోత్సవాల సందర్భంగా మహారాష్ట్ర భక్తులు భారీగా తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకున్నారు.

## మట్టి ప్రతిమల పంపిణీ



ఇంద్రపాలెంలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కాకినాడ రూరల్: వినాయక చవితి సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నాయి. ఇంద్రపాలెంలో మన ఊరు–మన బాధ్యత స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. రసాయనాలు వాడి తయారుచేసిన విగ్రహాలు వాడవద్దని కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద మట్టి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి ప్రతిమల వల్ల ప్రయోజనాలు వివరించారు.

## జేవీవీపై పెరిగిన సామాజిక బాధ్యత



జన విజ్ఞాన వేదిక నూతన కమిటీని అభినందిస్తున్న ప్రతినిధులు

కాకినాడ సిటీ: సమాజంలో జేవీవీ ఆవశ్యకత ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర పరిశీలకుడు కె.త్రిమూర్తులు అన్నారు. జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా మహాసభలు ఆదివారం స్థానిక యూటీఎఫ్ హోంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన త్రిమూర్తులు మాట్లాడుతూ, సమాజ అవసరాలకు తగ్గట్టుగా జేవీవీ జిల్లా కమిటీ తమ కార్యక్రమాలను రూపొందించుకుని, ముందుకు సాగాలని నిర్దేశించారు. తొలుత జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. రెండేళ్ల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే రెండేళ్లకు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జన విజ్ఞాన వేదిక నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేఎంఎంఆర్ ప్రసాద్, జీఎస్‌హెచ్ ప్రసాద వర్మ, కోశాధికారిగా పి.బాలాజీ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి జిల్లాలోని పది మండలాల నుంచి 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాసూరిబాబు, ఏపీఆర్ఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్తిరాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రమణి ప్రసంగించారు.

## తీర ప్రాంత రక్షణపై ఆందోళన

- వచ్చే నెల 21న నిరాహార దీక్ష
- తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి



కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వెంకటేశ్వరరావు తదితరులు

కొత్తపల్లి: ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని బీసీ ఉద్యమ నాయకుడు, తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 21వ తేదీన ఉప్పాడ బీచ్ రోడ్డులో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం పోలీసులకు పత్రాలు సమర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీర ప్రాంతంలో ఉన్న కోనపాపపేట, ఉప్పాడ ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసివెళ్లడమే మినహా, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీర ప్రాంతంలో జనావాసాలు కనుమరుగవుతాయన్నారు. కరప మండలం ఉప్పలంక నుంచి తొండంగి మండలం అద్దరిపేట వరకూ ఉన్న 67 మత్స్యకార గ్రామాల్లో నెలకు రూ.11,500 పరిహారంగా ఇవ్వాలన్నారు. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికీ రూ.50 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న యువతకు జిల్లాలోని పరిశ్రమల్లో 20 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఆయా డిమాండ్లపై సెప్టెంబర్ 21న మత్స్యకారులతో కలిసి ఉప్పాడలో నిరాహార దీక్షను చేపడుతున్నట్టు వివరించారు.

### ఉప్పాడ బీచ్ రోడ్డులో పోలీసుల ప్రత్యేక డ్రైవ్

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాటి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు ఈ–చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. వీరితో పాటు, అమాయకులు కూడా ప్రమాదాల బారినపడి క్షతగాత్రులు కావడమో, ప్రాణాలు కోల్పోవడమో జరుగుతుందని తెలిపారు.

### రేపు బీజేపీ నేత మాధవ్ రాక

బోట్‌క్లబ్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం కాకినాడలో పర్యటించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదివారం విలేకర్లకు తెలిపారు. తొలిసారిగా జిల్లాకు వస్తున్న ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం చాయ్‌పే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో నాయకర్ విగ్రహానికి నివాళులర్పిస్తారన్నారు. 11 గంటలకు కార్యకర్తల సమావేశం, సాయంత్రం 4 గంటలకు ఇంటలెక్చువల్ మీట్ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.